క్లుప్తంగా

ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు



అంధవరం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

జలుమూరు: మండలంలోని అంధవరం ఇసుక రీచ్ నుంచి ఇసుక తవ్వినా, రవాణా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జెన్ని రామారావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ సిబ్బందితో వంశధార నది రేవులలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నదిలో నీటి ప్రవాహం ఉండటంతో ఇసుక తవ్వకాలు ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వంశధార నది తీర గ్రామాలైన కొమనాపల్లి, దొంపాక, అంధవరం, పర్లాం, శ్రీముఖలింగం తదితర గ్రామాల్లో దండోరాలు వేయించారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్టీఓ భాగ్యలక్ష్మి

పాతపట్నం: పాతపట్నం ఉపఖజానాధికారి (ఎస్టీఓ)గా మల్లిపురం భాగ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె టెక్కలి ఉప ఖజానా (ట్రెజరీ)లో ఎస్టీఓగా పని చేసి బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎల్.మీనమ్మ విశాఖపట్నం జిల్లా సబ్బవరం ఎస్టీఓగా బదిలీపై వెళ్లారు. ఎస్టీఓ భాగ్యలక్ష్మిని సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఐసీడీఎస్ పీఓగా శోభారాణి



నరసన్నపేట: నరసన్నపేట ఐసీడీఎస్ పీఓగా పి.శోభారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి నుంచి బదిలీపై నరసన్నపేటకు వచ్చారు. నరసన్నపేట పీఓగా పనిచేసిన నాగమణి ఆమదాలవలసకు బదిలీ అయ్యారు.

వ్యవసాయశాఖ ఏడీగా వెంకటమధు



నరసన్నపేట: వ్యవసాయశాఖలో బదిలీలు కొలిక్కివచ్చాయి. పలువురు ఏడీలకు, ఏఓలకు బదిలీలయ్యాయి. నరసన్నపేట ఏడీగా లింగాల వెంకటమధు బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఈయన పలాసలో ఏడీగా పని చేస్తున్నారు. నరసన్నపేట ఏడీగా ఐదేళ్లు పనిచేసిన కె.రవీంద్రభారతి శ్రీకాకుళం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ డీఏఓగా బదిలీ అయింది. రెండు, మూడు రోజుల్లో వెంకటమధు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

రూ.1.05 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.05 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో రోడ్లు, డ్రైన్లు, ఇతర అత్యావసర పనులు 44 ప్రతిపాదనలు చేశామని, ఈ మేరకు పనులు చేపడతామన్నారు. వార్డు సభ్యులు, స్థానికుల సూచనల మేరకు పనులు ప్రతిపాదించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు చెందిన ఇంజినీర్లు పనులను పర్యవేక్షించనున్నారని తెలిపారు. వీలున్నంత తొందరగా పనులు పూర్తి చేస్తామన్నారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా తారకేశ్వరరావు



సరుబుజ్జిలి: మండల శాఖ ప్రెస్‌క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లిధర్మారావు మంగళవారం వెల్లడించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కూటికుప్పల తారకేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా బెండి శ్యామలరావు, ప్రధాన కార్యదర్శి బగాది భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా బాడాన మహేష్, జాయింట్ కార్యదర్శిగా ఎస్.అసిరినాయుడు, కోశాధికారిగా యండ అన్నందొర, న్యాయ సలహాదారునిగా బగాది ధనంజయరావును ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.ఈశ్వరరావు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

కొత్తూరు: మండల కేంద్రంలోని సీతారామ ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా సీతారామస్వాముల ఉత్సవ మూర్తులను మంగళవారం తిరువీధి నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 12వ తేదీన కొత్తూరులోని హరిదాసు కోనేరులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

- పంటల సాగులో వైవిధ్యం చూపితే అనేక ప్రయోజనాలు
- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం
- తరచూ ఒకే పంట వేయడం వల్ల చీడపీడల ఉద్ధృతి అధికం
- పంట మార్పిడితో సేంద్రియ పదార్థాల వృద్ధి

హిరమండలం: పొలంలో ప్రతిసారీ వేసిన పంటనే మళ్లీ వేయడం వల్ల దిగుబడి తగ్గడంతోపాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలాకాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకేరకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంటమార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతగా వినియోగించవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలుగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అన్నదాతలు పంటమార్పిడి ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకేతరహా పంట సాగుతో నష్టాలు..

- ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైరులు, తక్కువ లోతుకు వెళ్లే పైర్లు ఒకదాని తరువాత ఒకటి సాగు చేయాలి.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటను ఒకదాని తరువాత ఒకటి సాగు చేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి..

- వరి పంట సాగుచేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.
- వరి తరువాత అపరాలు పంట పైరు సాగుచేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉద్ధృతి తగ్గుతుంది.
- వరి తరువాత గింజ జాతికి చెందిన శెనగ, పెసర, మినుము, వేరుశెనగ వంటివి సాగుచేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టిరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బొడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు



ఏటా ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలామంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ సాగు చేస్తున్నారు. నీటిపారుదల ఉన్నచోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి విధానం చాలా ఉత్తమం. రైతులు విధిగా పంట మార్పిడి చేపట్టాలి.

– బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, హిరమండలం

కన్నుల పండువగా సిరిమానోత్సవం



ప్రధాన రహదారిలో సిరుమాను రథంపై శ్రీరామ్ పంతులు

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామంలో ఏడేళ్ల తర్వాత నిర్వహించిన జడ్డమ్మ తల్లి ఉత్సవాల్లో చివరి ఘట్టమైన సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. గ్రామంలోని పెద్దవీధి నుంచి ప్రధాన రహదారి మీదుగా సిరిమాను రథం, అంజలి రథంపై గ్రామ పెద్దలు ఊరేగారు. సిరిమాను రథంపై గ్రామ సేవకుడు ప్రగడ శ్రీరామ్ పంతులు కూర్చున్నారు. గ్రామస్తులందరూ సిరిమానోత్సంలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. పాతపట్నం సీఐ వి.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

200 లీటర్ల సారా స్వాధీనం

- 2,600 బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మెళియాపుట్టి, కొత్తూరు మండలాలకు ఆనుకుని ఉన్న ఒడిశా గ్రామం సంగిపూర్, తదితర గూడల పరిసరాల్లో 200 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. 2,600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ ఎం.శ్రీనివాసరావు, పాతపట్నం, కొత్తూరు, టెక్కలి, శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు, ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి, కాశీనగర్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

14కు చేరిన ఉన్నత పాఠశాలలు

నరసన్నపేట: మండలంలో ఈ విద్యా సంవత్సరం నుంచి మరో రెండు హైస్కూల్స్ కొత్తగా ఏర్పడ్డాయి. వీఎన్‌పురం, దేశవానిపేటల్లో ఇప్పటివరకు ఉన్న యూపీ స్కూల్స్ ఉన్నత పాఠశాలలుగా మార్చారు. ప్రస్తుతం మండలంలో 12 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి 14 ఉన్నత పాఠశాలలు అవుతున్నాయని ఎంఈఓ శాంతారావు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విద్యా విధానం వలన మండలంలో మోడల్ ప్రైమరీ స్కూల్స్ కొత్తగా ఏర్పాటు చేశారు. వీటిని దేశవానిపేట, బొరిగివలస, నరసన్నపేట బోర్డు, పెద్దపేట, సత్యవరం, వీఎన్‌పురం, బుచ్చిపేట, మడపాం, మాకివలసల్లో ఏర్పాటు చేశారు. ఈ స్కూల్స్‌లో రోల్ ప్రకారం ఉపాధ్యాయులు ఉంటారు.

కష్టమే మిగిలింది..!


- అమ్ముడుపోని కొండ చీపుర్లు
- గిట్టుబాటు ధర కోసం గిరిజనుల ఎదురుచూపులు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు



పాప్పంగిలో కొండ చీపుర్లపై కప్పిన టార్పాలిన్లు

సారవకోట: మండలంలోని కొండ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న కొండ చీపుర్ల పంట అమ్ముడుపోక గిరిజనులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పాప్పంగి, సవరబొంతు, రైవాడ, బొంగాడిపేట, సోమయ్యపేట, బొమ్మికపేట, జగన్నాథపురం, సవర మాళువ, బొంతుగూడ తదితర గిరిజన గ్రామాల్లోని గిరిజనులు కొండ చీపుర్లు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పంట అనుకూలంగా వచ్చినప్పటికీ గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆయా గ్రామాల్లో గిరిజనులు వాటిని కుప్పలుగా పెట్టి గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలకు వ్యారులు వచ్చి కేజీ రూ.20 నుంచి రూ.30 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గిరిజనులు ఆ ధరకు విక్రయించేందుకు ఇష్టపడక వాటిని కుప్పలుగా పెట్టి వర్షాలకు తడిచిపోకుండా టార్పాలిన్లు కప్పి భద్రపర్చుకుంటున్నారు. గిరిజనులు పండించిన ఉత్పత్తులను జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి. జీసీసీ ద్వారా కొనుగోలు చేసే దాఖలాలు లేవు. గిరిజనుల ఏడాది కాలం కష్టపడి కొండల్లో పండించిన చీపురు పుల్లలను గ్రామాలకు తీసుకొచ్చి వాటిని శుభ్రం చేశారు. చీపురు పంటను ఈ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సారవకోట మండలంలో చీపుర్లు సాగు చేసుకుంటూ సుమారు 100 కుటుంబాల వరకు జీవనం సాగిస్తున్నాయి. ఈ పంటకు గిట్టుబాటు ధరలేకపోవడంతో వీరంతా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి



గిరిజనులు కొండ పోడు ప్రాంతాల్లో సాగు చేస్తున్న ఉత్పత్తులను జీసీసీ ద్వారా ఐటీడీఏ వారు కొనుగోలు చేయాలి. మండలంలో అనేక మంది గిరిజనులు కొండ చీపుర్ల పంట సాగుచేశారు. అధికారులు వెంటనే కొండ చీపుర్లను కొనుగోలు చేయాలి.

– చౌదరి లక్ష్మీనారాయణ, గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, సారవకోట

నీలమణిదుర్గ ఆలయ హుండీ లెక్కింపు రేపు

పాతపట్నం: ఈ నెల 12వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు దేవదాయశాఖ అధికారులు, భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భక్తులు డ్రస్ కోడ్ పాటించి పాల్గొనవచ్చన్నారు.

నేడు మండల సమావేశం

జలుమూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

ఆమదాలవలస: పట్టణంలోని టింపనీ స్కూల్‌లో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యం శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ కరెస్పాండెంట్ బొడ్డేపల్లి వెంకటనారాయణరావు మంగళవారం తెలిపారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి శంకర్ ఫౌండేషన్‌కు తరలిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామంలో గల చంద్రశేఖరస్వామి ఆలయంలో జేష్ఠ మాసం పౌర్ణమి సందర్భంగా శివపార్వతుల కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇంద్రసేనరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. తెంబూరుతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



ఏబీ రహదారిలో పక్కకు ఒరిగిన లారీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని ఏబీ రహదారిలో మోదుగువలస–ఎల్ఎన్‌పేట కూడలి మధ్య ఇసుక లారీకి ప్రమాదం తప్పింది. హిరమండలం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి రోడ్డు పక్కన దిగబడి పూర్తిగా ఒరిగిపోయింది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

ఘనంగా గ్రామ దేవత ఉత్సవాలు



గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో తీరువీధి నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర అపోజిట్ ఆర్ఆర్ కాలనీ, సిరుసువాడ గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గురాటలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. గ్రామాల్లో సందడి నెలకొంది.

ప్రమాదకరంగా చెట్టు కొమ్మ



జలుమూరు మండలంలోని సురవరం పంచాయతీ పరిధి దొంపాక గ్రామం ఎల్‌కే రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రామ దేవత మర్రి చెట్టు కొమ్మ ప్రమాదభరితంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలు, వీచిన గాలులకు చెట్టుకొమ్మ విరిగి వేలాడుతుంది. ఈ రోడ్డులో రోజుకు వందలాది వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తారు. ఆ సమయంలో చెట్టుకొమ్మ పూర్తిగా తెగిపడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి చెట్టుకొమ్మను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– జలుమూరు

మహిళలకు రక్షణ లేకుండా పోయింది



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మహిళకు అన్యాయం జరిగితే వెంటనే ఆదుకునేందుకు, నెల రోజుల్లోనే న్యాయం జరిగేందుకు వీలుగా తీసుకువచ్చిన దిశ యాప్‌ను చంద్రబాబు ప్రభుత్వం మూలకు నెట్టేసిందని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన ఏడాదిలో 188 మందికి పైగా ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరిగాయని తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: కూటమి నాయకులు కావాలనే సాక్షి కార్యాలయాలపై దాడులకు దిగుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుద్దల రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వీరు విలేకర్లతో మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి పత్రికా కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతూ శృతిమించి ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. కొత్త సంస్కృతికి కూటమి నాయకులు తెరలేపారన్నారు. ఇటువంటి దాడులు సరైనవి కాదని హితవు పలికారు. ఎచ్చెర్ల సాక్షి కార్యాలయంపై తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. పార్టీ నాయకులు వాన గోవిందరావు, బొబ్బాది ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఆస్తుల ధ్వంసం హేయమైన చర్య



కోట గోవిందరావు

ఆమదాలవలస: సాక్షి కార్యాలయాలపై కూటమి మూకలు దాడిచేసి ఆస్తులను ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టును, రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై చేసిన దాడులను మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. నిజాలు రాసే వారిని, వాస్తవాలను చెప్పే గొంతులను అణిచివేసే దిశగా కూటమి పాలన సాగిస్తోందన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే పత్రికా స్వేచ్ఛకు కూటమి నాయకులు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. సాక్షి టీవీలో జరిగిన చర్చలో కొన్ని వ్యాఖ్యలపై నిరసనల పేరుతో కూటమి నాయకులు దౌర్జన్యానికి దిగడం దారుణమన్నారు. అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క హామీ అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కూటమి ఏడాది పాలనలో అక్రమ కేసులు, అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఈ ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, సాక్షిపై దాడులకు తెగబడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షిపై దాడి అమానుషం



ఖండాపు గోవిందరావు

బూర్జ: ఎచ్చెర్ల సాక్షి యూనిట్ కార్యాలయంపై కూటమి మూకలు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పత్రికా స్వేచ్ఛపై దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అనైతికమన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామంలో గల ఎస్సీ వీధిలో ఆర్అండ్‌బీశాఖకు చెందిన పాలకొండ–హడ్డుబంగి రోడ్డు ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. ఈ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో గత కొన్ని సంవత్సరాలుగా మురుగునీరు ప్రవహించి భారీ గోతులు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. మురుగు కాలువలు నిర్మించి గోతులు పూడ్చడ్చారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలకు చెందిన సిబ్బంది చేరుకొని ఆక్రమణలు తొలగించారు. తహసీల్దార్ పి.బాలకృష్ణ, జేఈ గోపాలరావు, ఈఓపీఆర్డీ వసంతకుమారి పాల్గొన్నారు.

నిరుపయోగం..



నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం



వినియోగంలో లేని వంటశాల భవనం

ఆమదాలవలస రూరల్: మండలంలోని కంచపాపు ప్రాథమిక పాఠశాల, వంట భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో కొన్ని ప్రభుత్వ పాఠశాలలను మూతవేసింది. ఇదే గ్రామంలో అంగన్‌వాడీ, తదితర ప్రభుత్వ శాఖలకు సంబంధించి భవనాలు, పాఠశాల మూసివేయటంతో ఆ రెండు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకురావటంతో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. పాఠశాల భవనంతోపాటు మధ్యాహ్న భోజనశాల భవనాలు నిరుపయోగంగా పడి ఉండటంతో ఆ గ్రామానికి చెందిన కొందరు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా ఆ రెండు భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.